క్లుప్తంగా

బీటీ రోడ్లపై భోగి మంటలు వేయకండి


జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలో సంక్రాంతి వేడుకలు నిర్వహించే వారు బీటీ రోడ్లపై భోగి మంటలు వేయరాదని శనివారం జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ కోరారు. 40 నుంచి 63 వార్డులకు సంబంధించిన ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జోన్ అభివృద్ధిలో భాగంగా ఇటీవల సీసీ, బీటీ రోడ్లతో వార్డులను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. భోగి మంటలు వేయడం వల్ల రోడ్లపై తారు మరిగి గుంతలమయంగా మారుతాయన్నారు. వార్డుల సుందరీకరణలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

మల్కాపురం: హిందూస్థాన్ షిప్‌యార్డ్ యాదవ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024వ సంవత్సర క్యాలెండర్‌ను మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు విడుదల చేశారు. షిప్‌యార్డ్ యాదవ ఉద్యోగులు ఐక్యతతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జోగ రాజుయాదవ్, కూన నర్సింగ్‌రావుయాదవ్,ఎదుర శ్రీనివాసరావుయాదవ్,గొంప చిన్నాజీయాదవ్,మాడిసి శ్రీనివాసరావుయాదవ్,నీలాతి వంశీయాదవ్,ఉరుకూటి సింహచలం యాదవ్,పి.అప్పలరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సుల తనిఖీ


షీలానగర్ వద్ద బస్సులు తనిఖీ చేస్తున్న ఎంవీఐ రాజారావు

అక్కిరెడ్డిపాలెం: సంక్రాంతి పండగ నేపథ్యంలో మోటార్ వెహికల్ అధికారులు ట్రావెల్ బస్సుల తనిఖీలు నిర్వహిస్తున్నారు. శనివారం షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్ద మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజారావు సిబ్బందితో కలిసి విజయవాడ-విశాఖపట్నం, హైదరాబాదు-విశాఖపట్నంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వివిధ సంస్థల ట్రావెల్ బస్సులను తనిఖీ చేశారు. అదనపు చార్జీలు, పరిమితికి మించి లోడ్లు వంటి వాటిపై తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎటువంటి కేసులు నమోదు చేయలేదని పేర్కొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన దుర్గాప్రసాద్

కొత్తవలస: కొత్తవలస-పెందుర్తి రైల్వే లైన్‌లో మంగళపాలెం గ్రామ సమీపంలో రైలు కింద పడి తాటిచెట్లపాలెం సమీపంలోని సంజీవయ్య కాలనీకి చెందిన పిట్టా దుర్గాప్రసాద్ (47) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కొద్ది కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలిసింది. మంగళపాలెంలో తెలిసిన వారి ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. జీఆర్పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఏడీరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

ప్రజలతో ఉండే కుటుంబం మాది

- యలమంచిలి మున్సిపల్ ఛైర్ పర్సన్ రమాకుమారి
- ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ


మహిళలకు బహుమతులు అందిస్తున్న రమాకుమారి తదితరులు


60వ వార్డు ప్రాంత విజేతలకు బహుమతులు అందిస్తున్న రమాకుమారి,కార్పొరేటర్ పీవీ సురేష్

గోపాలపట్నం: నిత్యం ప్రజలతో ఉండే కుటుంబం తమదని యలమంచిలి మున్సిపల్ ఛైర్ పర్సన్ రమాకుమారి అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు శనివారం ఆమె 89వ వార్డు కొత్తపాలెంలో క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణతో కలిసి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ డెయిరీ ద్వారా నిత్యం లక్షా యాభైవేలకు పైగా రైతు కుటుంబాలతో అనుబంధం కలిగి ఉన్నామన్నారు. అలాగే పశ్చిమ నియోజకవర్గ ప్రజలతో మమేకమవుతున్నామని తెలిపారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా అందుబాటులోనే ఉండే కుటుంబం తమదన్నారు. ప్రజలకు సేవా చేయాలనే లక్ష్యంతో ఆనంద్‌కుమార్ విస్తృత సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ముగ్గుల పోటీలు విజయవంతం చేయడానికి సహకరించిన నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ ఆళ్ల పైడిరాజు, మాజీ కార్పొరేటర్ అయితంశెట్టి కోటేశ్వరరావు, నాయకులు గవర నాయుడు, విజయ్ చరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

91, 92 వార్డుల్లో..

గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో ముగ్గుల పోటీల విజేతలకు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో ఉత్సాహం నింపేందుకు ఆనంద్‌కుమార్ ముగ్గుల పోటీలు నిర్వహించారన్నారు. పేదలకు అండగా ఉండే నాయకుడు ఆడారి ఆనంద్ కుమార్ అని అన్నారు. ఆయనకు అందరం అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో 91, 92వ వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పల స్వామి నాయుడు, నాయకులు కంపర కోటేశ్వరరావు, శ్రీనివాస రెడ్డి, ఆర్పీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


మహిళలకు బహుమతులు అందిస్తున్న బెహరా భాస్కరరావు

60,61వ వార్డులో..

మల్కాపురం: సంక్రాంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో వార్డు స్థాయిలో విజేతలకు శనివారం బహుమతులు పంపిణీ చేశారు.దీనిలో భాగంగా 59వ వార్డు నక్కవానిపాలెం పార్టీ కార్యాలయంలో విజేతలకు యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్స్ రమాకుమారి 60వ వార్డు కార్పొరేటర్ పి.వి. సురేష్, వార్డు పార్టీ అధ్యక్షుడు ఆడారి హరీష్,క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్‌తో కలిసి బహుమతులు అందించారు.కార్యక్రమంలో కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ మళ్ల ధనలత, నాయకులు గుంట సుందరరావు,హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

- 61వ వార్డు పరిధి విజేతలకు వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ,వార్డు పార్టీ అధ్యక్షుడు జీ.వీ.ఎస్.ఎన్.రాజు (కేబుల్ వాసు),జేసీఎస్ కన్వీనర్ భోగ వల్లి నాగభూణం,నాయకులు సోనూ,బాలు,బూస అప్పలరెడ్డి తదితరులతో కలిసి బహుమతులు అందించారు.


మహిళలకు బహుమతులు అందిస్తున్న రామ్మోహనరెడ్డి

63వ వార్డులో...

సింధియా: నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన కాకరలోవకు చెందిన కె.పూర్ణకు శనివారం 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి వాషింగ్ మెషిన్‌ను అందజేశారు. అలాగే పాల్గొన్న వారికి కన్సొలేషన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్, నాయకులు సూరాడ పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి శోభ


రద్దీగా మారిన గోపాలపట్నం ప్రధాన రహదారి

- వాణిజ్య, వస్త్ర దుకాణాలు కిటకిట
- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మల్కాపురం: అంతటా సంక్రాంతి సందడి మొదలైంది. కొనుగోలు దారులతో వాణిజ్య, వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. అయితే వ్యాపారులు దుకాణాల వద్ద విద్యుత్ లైట్లు, సంక్రాంతి పండగను గుర్తు చేసే విధంగా ఏర్పాటు చేసిన సెట్లు ఆకట్టుకుంటున్నాయి. పలు ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీహరిపురంలోని శ్రీనివాస్ స్వీట్స్ స్టాల్ యజమాని సంక్రాంతి పండగ సమయంలో పల్లె వాతావరణం ప్రతిబింబించే విధంగా ఇక్కడ సెట్ వేశారు. మల్కాపురం హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద నిర్వాహకులు తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా రెండు పూరి గుడెసెలు,పందెం పుంజులు,భోగి వాతావరణం కనిపించే విధంగా తీర్చిదిద్దారు. మల్కాపురం మైదానంలో కొంత మంది బాలికలు సంక్రాంతి ముగ్గు వేసి ఆ ముగ్గు చుట్టూ పల్లె పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. మల్కాపురం,నగరాలవీధి,పల్లివీధి రామాలయాల్లో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల మహిళలు లలిత పారాయణ,గొవింద నామాలు పఠించారు.


రామాలయంలో కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు


శ్రీహరిపురంలో వేసిన భోగి సెట్

దుకాణాల వద్ద జనసందోహం

గోపాలపట్నం: సంక్రాంతి పండగతో గోపాలపట్నం ప్రధాన రహదారి రద్దీగా మారింది. వీధి రోడ్లు సైతం ఇరుగ్గా మారిపోయాయి. ప్రధాన రహదారిలో వాహనాల పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వీధి రోడ్లలో వాహనాలు పార్కింగ్ చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రధాన రహదారి పాదచారులు నడిచేందుకు వీల్లేని విధంగా మారింది. వాహన చోదకులు గోపాలపట్నం దాటితే చాలనుకుంటూ మెల్లగా ప్రయాణిస్తున్నారు. ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం వెళ్లే రోడ్డు ఎక్కువగా రద్దీగా మారింది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలు ఆగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. క్రైం పోలీసులు రద్దీగా ఉన్న చోట్ల దొంగలు చేతి వాటం ప్రదర్శించకుండా నిఘా పెట్టారు. వినియోగదారులను అప్రమత్తం చేస్తున్నారు.


దుకాణాల వద్ద పహారా కాసిన క్రైం, ట్రాఫిక్ పోలీసులు


రంగవల్లి చుట్టూ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చిరో ప్రాక్టిక్ థెరపీతో మెరుగైన వైద్యం


డాక్టర్ టామ్‌ను అభినందిస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు


నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

మల్కాపురం: మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో శనివారం 'ఆరోగ్య పరిరక్షణ థెరపీ' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. కార్యక్రమంలో బెల్జియం వైద్య నిపుణుడు టామ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి మందులు వాడకుండా చిరో ప్రాక్టిక్ థెరపీ ద్వారా నరాలను బలోపేతం చేయడం ఆధునిక పద్ధతి అని చెప్పారు. చేతిని ఉపయోగిస్తూ వెన్నుముకకు చికిత్స చేయడమే చిరో ప్రాక్టిక్ థెరపీ అని వివరించారు.సెల్ ఫోన్‌లో మాట్లాతూ ఉండడం వల్ల, నిటారుగా కూర్చొకపోవడం వల్ల, విపరీతమైన పని ఒత్తిడి వల్ల నరాల ,కండరాలు సమస్యలు వస్తున్నాయన్నారు. చిరో ప్రాక్టిక్ థెరపీ గురించి జర్మనీకి చెందిన కైసర్, పారిస్,ఆస్ట్రేలియా,స్పెయిన్‌కు చెందిన వైద్యులు నరాల సమస్యలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు దేశాల నుంచి వచ్చిన వైద్య నిపుణులను సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఇక్కడ వేదికపై ఏర్పాటు చేసిన భారత సంప్రదాయ నృత్యాలు విదేశీ వైద్యులను ఆకట్టుకున్నాయి.

కార్మికుల సంక్షేమమే 'ఇంటక్' ప్రధాన ఎజెండా


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంటక్ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్

అక్కిరెడ్డిపాలెం: కార్మికుల సంక్షేమమే ప్రధాన ఎజెండా అని ఇంటక్ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ అన్నారు. ఆటోనగర్‌లోని ఏపీఎస్ఈబీ కో ఆపరేటివ్ సొసైటీ బిల్డింగ్‌లో శనివారం నిర్వహించిన జిల్లా ఇంటక్ అత్యవసర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విశాఖ భవిష్యత్తుకు ప్రమాదకరం అన్నారు. కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలన్నారు. అనంతరం ఇంటక్ నూతన క్యాలెండర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో భెల్ (హెచ్‌పీవీపీ) ఇంటక్ నాయకుడు ఉరుకూటి బాబూరావు, డాక్‌యార్డు నుంచి బి.చిన్నారావు రెడ్డి, ఎం.కె.కొండబాబు, హెచ్‌పీసీఎల్ నుంచి నర్సింగరావు, షిప్‌యార్డు నుంచి శ్రీరామ్మూర్తి, ఎంఈఎస్ నుంచి షేక్ బాజ్జీ, స్టీల్‌ప్లాంట్ నుంచి నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, పి.వి.నగేష్, పి.వి.రమణమూర్తి, గంగవరం గోపీ, ఎన్టీపీసీ నుంచి బీమారావు, లెనిస్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ


బాడీ డౌన్ లాడర్ స్కోలింగ్, టైర్ క్రాలింగ్ ప్రక్రియలపై విద్యార్థులకు శిక్షణ

పెదగంట్యాడ: జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవడంతో పాటు అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలనే అంశాలపై హిందుస్థాన్ సౌట్స్ అండ్‌గైడ్స్ విద్యార్థులకు శనివారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 30మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఫైర్ ఫైటింగ్, బాడీ డౌన్ లాడర్ స్కోలింగ్, టైర్ క్రాలింగ్ ప్రక్రియలపై శిక్షణ ఇచ్చారు. ప్రతికూల పరిస్థితుల్లో, ఆపదలు, విపత్తులు సంభవించినపుడు ఇతరులకు ఎలా సాయం అందించాలనే అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో టెంట్లు వేయించడం, అప్పటికప్పుడు ఆహార పదార్థాలను తయారు చేయడం తదితర అంశాలను వివరించారు. స్కౌట్ మాస్టార్ ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల నిరవధిక ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లకుండా ఉండేలా తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు శనివారం నాటికి 1066వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-2 విభాగ కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వారికి అప్పగించాలన్న నిర్ణయానికి ఎదురు తిరిగిన కార్మిక వర్గానికి దెబ్బ కొట్టాలని చూస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి దొడ్డి దారిన ఉక్కు యాజమాన్యంతో కలిసి విద్రోహ చర్యలు చేపట్టారని ఆరోపించారు. సంస్థలో ప్రధాన విభాగాలను పాక్షికంగా నిలిపివేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఉక్కు నిర్వాసితులు ఇప్పటికీ శాశ్వత ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ఉద్యమ సెగ దేశవ్యాప్తంగా వెళ్లిందన్నారు. దీనికి మద్దతుగా కార్మికులంతా పెద్ద ఎత్తున ఉక్కు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు.ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక,ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి వారికి అందజేశారు.

గ్రీన్ బెల్ట్‌కు రక్షణ

మూగజీవాలు ప్రవేశించకుండా గ్రిల్స్ ఏర్పాటు


గ్రిల్స్ ఏర్పాటు పనులు చేస్తున్న సిబ్బంది


గ్రీన్‌బెల్ట్ పార్కుకు ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్

విశాఖ విద్య: విశ్వనగరాన్ని సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వం.. దాని పరిరక్షణకు కూడా చర్యలు చేపట్టింది. పచ్చదనం పెంపొందించడంలో భాగంగా నగరంలో రహదారుల వెంబడి ఖాళీగా ఉన్న ప్రాంతాలను గ్రీన్ బెల్ట్‌లుగా అభివృద్ధి చేసింది. వాటిలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో పచ్చని మొక్కలు పెంచి ఆహ్లాదం పంచే చర్యలు చేపట్టింది. అయితే వాటిని పాడు చేయకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. మూగజీవాలు ప్రవేశించకుండా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు జీవీఎంసీ 52వ వార్డులో చురుగ్గా సాగుతున్నాయి. హైవేకు ఆనుకొని ఉన్న మద్రిపాలెం గ్రీన్‌బెల్ట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు, ఇక్కడ వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ సందడి కనిపిస్తోంది. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవతో పార్కులను అభివృద్ధి చేస్తున్నారు. వీటికి ప్రజాదరణ పెరుగడంతో ఎక్కువ కాలంలో మనుగడలో ఉండేలా పార్కుల పరిరక్షణకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా గ్రీన్ బెల్ట్ పార్కు చుట్టూ ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి. పార్కు చుట్టూ ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసి, హైవే వైపు మరింత అందంగా కనిపించేలా నగర పాలక సంస్థ, ఎకో వైజాగ్ నినాదాన్ని చాటేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్కులు ఎక్కువ కాలం పాటు ప్రజలు ఉపయోగించుకునేలా ఇటువంటి ఏర్పాట్లు చేస్తున్నామని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు.

ఆధునికతను స్వాగతిద్దాం.. సంప్రదాయాలను కాపాడుకుందాం

సినీనటుడు సాయికుమార్


మాట్లాడుతున్న సినీనటుడు సాయికుమార్

ఏయూక్యాంపస్: ఆధునికతను స్వాగతిస్తూనే.. మన సంప్రదాయాలను కాపాడుకుందామని సినీ నటుడు పూడిపెద్ది సాయికుమార్ పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న మహా సంక్రాంతి సంబరాల్లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలు, కళాకారులను అందించిన విశాఖ నగరం సాంస్కృతిక రాయబారిగా నిలుస్తుందన్నారు. 'నా తండ్రిది విజయనగరం జిల్లా కళ్లేపల్లి అగ్రహారం. నేను శ్రీకాకుళం జిల్లా అల్లుడినే..' అని చెబుతూ ఉత్తరాంధ్రతో తనకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భవిష్యత్ తరానికి అందించే బాధ్యతను జీవీఎల్ బృందం ఎంతో సమన్వయంతో నిర్వహించిందన్నారు.

తొలి షీల్డ్ విశాఖలోనే అందుకున్నాను

నేను నటించిన తొలి చిత్రం ఛాలెంజ్ విశాఖలో చిత్రీకరించారని.. చిరంజీవితో కలిసి ఈ చిత్రంలో నటించిన సందర్భాన్ని సాయికుమార్ గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రం 100 రోజుల వేడుక విశాఖలో జరిగిందని, మొదటి షీల్డ్‌ను ఇక్కడే తీసుకున్న జ్ఞాపకాలను వివరించారు. సాయంత్రం వేళ ఉత్తరాంధ్రకు చెందిన కళాకారుల ప్రదర్శనలు, మిమిక్రీ, సంగీత విభావరి, శాస్త్రీయ నృత్యాలు ఎంతో ప్రత్యేకమన్నారు. జీవీఎల్ మాట్లాడుతూ ఘంటసాల పాట, గోంగూర పచ్చడి తెలుగు వారికి ఎంత ఇష్టమో.. సాయికుమార్ స్వరం కూడా అంతే ఇష్టమన్నారు. ఆదివారం ఉదయం 4 గంటల నుంచి ఇదే ప్రాంగణంలో భోగి మండలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి చిన్నారులకు భోగిపళ్లు పోసే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఇక్కడ చేసిన ఏర్పాట్లు ఆకట్టుకున్నాయి. డప్పు వాయిద్యాలు, గంగిరెద్దులు, థింసా నృత్యాలు, కోలాటం , కర్రసాము, సంగీత విభావరి నగర వాసులను అలరించింది. శ్రీ రామాయణ నృత్యరూపకం, ప్రాసమణి ప్రసంగం అదరహో అనేలా సాగింది. బుల్లెట్ భాస్కర్ టీం చేసిన స్కిట్లు కడుపుబ్బ నవ్వించాయి.

ముగిసిన గురు పూజోత్సవాలు


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బి.ఆర్.కె రాజు, కె.ఎస్.ఆర్ గోపాల్, బి.ఎస్.ఎన్.రాజు

మహారాణిపేట: ఆధునిక యుగంలో రకరకాల సమస్యలతో సతమతమవుతున్న మానవాళికి పరిష్కార మార్గమొక్కటే శరణ్యమని.. అలాంటి మార్గం పరమ గురువుల బోధనల్లో లభిస్తుందని ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ బి.ఎస్.ఎన్. రాజు(కోల్‌కతా) అన్నారు. జిల్లా పరిషత్ సమీపంలోని అంకోశా ఫంక్షన్ హాలులో శనివారం జగద్గురు పీఠం నిర్వహించిన 63వ మాస్టర్ సీవీవీ గురుపూజోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. శ్రీ రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, మాస్టర్ పార్వతీకుమార్ బోధనలతో తాను ప్రభావితం చెందానన్నారు. అనంతరం పార్వతీకుమార్ రాసిన మెర్రీ లైఫ్ డే అనే ఆంగ్ల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు 'శంబళ'అనే మరో పుస్తకాన్ని ఆవిష్కరించారు. సంస్థ సలహామండలి సభ్యుడు కె.ఎస్.ఆర్.గోపాల్ (హైదరాబాద్) 'విష్ణు సహస్రనామ' ప్రసంగాల రెండవ సంపుటిని విడుదల చేశారు. సభకు అధ్యక్షత వహించిన ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.గురుప్రసాద్ మాట్లాడుతూ విదేశాల్లో మత సంస్థ చేపడుతున్న జ్ఞానయజ్ఞం, రామనామ యజ్ఞ కార్యక్రమాలను వివరించారు. గురుపూజలో భాగంగా పప్పు రవిశంకర్ రుద్రాభిషేకం నిర్వహించారు.

బెంగళూరుకు చెందిన కె.రవి, ఖరగ్‌పూర్‌కు చెందిన జి.వి.కృష్ణమోహన్ తమ అనుభవాలను వివరించారు. 'నావాణి 'దర్శన మాసపత్రికపై సమీక్ష జరిపారు. జగద్గురుపీఠం వివిధ కేంద్రాల నుంచి రెండు వేలమందికి పైగా సాధకులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. మాస్టర్ ఇ.కె. నీరాజనంతో 63వ గురుపూజోత్సవాలు ఘనంగా ముగిశాయి. సంస్థ డైరెక్టర్ అజ్జరపు శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించగా, జగద్గురుపీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ పాల్గొన్నారు.